# లాకలూకాయి

ఉషశ్రీ రచన

రోకలి తెచ్చి తలకు చుట్టమన్న వాడికి పిచ్చి కుదిరిందనుకుని నిజంగా రోకలి పట్టుకొచ్చి తలకు చుట్టబెట్టడానికి ఎవడయినా ప్రయత్నిస్తే వాడికంటె పిచ్చివాడుండడు-అనేది ఏ మాత్రం వివేకం ఉన్నవాడయినా గ్రహించగలడు. గ్రహించగలగడమనేది వివేకానికి లక్షణమే కాని, గ్రహించినా దాన్ని విశ్వసించకపోవడమనేది ప్రజాస్వామ్యానికి లక్షణంగా కనిపిస్తున్నదన్నాడు ఇటీవల కనిపించిన లాకలూకాయి ఒకడు.

ఈ లాకలూకాయి స్వస్తిశ్రీ చాంద్రమాన ప్లవనామ సంవత్సర దక్షిణాయనంలో భాద్రపద శుద్ధ అమావాస్య నాడు పుట్టిన వాడు కాదు, ఆ తరువాయి పుట్టవలసిన వాడూ కాదు. ఇతని జనన కాలాన్ని గురించి ఐతిహాసికులు చాలా రోజులుగా పరిశీలించి, పరిశోధించి ఐక్యరాజ్య సమితికి ఒక దరఖాస్తు పెడుతూ ఈ వ్యక్తిని గురించిన వివరాలకోసం ప్రత్యేక సంఘాన్ని నియమించవలసిందని కోరారు.

సదరు నివేదికా రచన అచ్చువేసే విషయంలో రష్యా-అమెరికాల మధ్య ఒడంబడిక కుదరనందున దానిని ఉభయ దేశాల ప్రతినిధుల సమక్షంలో లక్క-సీలు వేసి భద్రపరచాలని తటస్థరాజ్యాలు ప్రతిపాదించాయి. కాని లక్కకు బదులు ఉక్కు-వాడాలని, సదరు ఉక్కు భారత చైనా సరిహద్దులలో లభించేదే అయిఉండాలనీ ఘనా ప్రతినిధి చేసిన ప్రతిపాదనను గ్రీకు ప్రధాని తిరస్కరించడంతో సీలు దేనితో వేయాలో నిర్ణయించడానికి జరిగిన సభ వాయిదాపడింది.

అయినా నివేదికలోఉండే విషయాలను గురించి బహుమంది పలురకాలుగా ఊహాగానాలు చేస్తున్నారని అభిజ్ఞవర్గాలు భావిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధి ప్రకటిస్తున్నారని స్థానిక వార్తా వారపత్రిక ముఖచిత్రం మీద వెలువరించింది.

ఈ నివేదిక విషయమై ఎంతో కొంత సమాచారం అందజేయవలసిందిగా రాయిటర్, పి. టి. ఐ. సంస్థలను పదే, పదే కోరగా, హెచ్చరించగా వారు చచ్చిచెడి చేయంగల విన్నపాలతో అందజేసిన సమాచారాన్ని ప్రచురించడానికి ప్రభుత్వ ప్రాపకంమీద బ్రతికే దిన పత్రికలు నిరాకరించాయి.

ఆ వార్తకు మాసపత్రికల్లో ప్రాముఖ్యం ఉండదని వారు అటు చూడనేలేదు. పక్షపత్రికలవారు తమ పాక్షిక దృష్టితో అయినా సదరు అంతర్జాతీయ సమస్యగా తయారైన లాకలూకాయి జనన రహస్య సమాచారం వైపు కన్ను పోనిచ్చారుకారు. కాగా పోగా మిగిలిన వారపత్రికలవారు మాత్రం చూసీ చూడనట్టు ఊరుకున్నారని పి. టి. ఐ. విలేఖరి రాయిటర్‌కి వర్తమానం పంపగా ఫలాని నెంబరు న్యూయార్కు-వార్త 'లాకలూకాయి' శీర్షికతో ఉన్నది. ప్రచురించుకోలేని పక్షంలో దానికి ప్రత్యేకంగా పన్ను కట్టవలసి ఉంటుందనేసరికి ఆయా దేశాల పత్రికాధిపతులందరూ అత్యవసర సమావేశం జరిపి ప్రధాన మంత్రికి దిగువ విధంగా అర్జీ పంపారు.

అయ్యా ఘనమైన ప్రధాన మంత్రివర్యా...తమ అత్యంత ఘనతవహించిన సమ్ముఖముఖానికి మేము తెలుపుకొనవలసిన అర్జీ విన్నపమేమనగా, సాధారణముగా లోకములో ఎవడైనను ఒక పావలా డబ్బులు సంపాదించుకొనగలిగినచో వానిపై 24 నయాపైసలువరకూ పన్ను వేయుటకూడ చూచి మేము ఆశ్చర్యపడలేదు. ఆందోళన చేయించలేదు.

అంతియకాక దినదినమూ రెండు పూటలూ తినుటకు తిండి యున్నను లేకపోయినను, సిటీ బస్సులకు సీటు దొరికినను దొరకకపోయినను, వాన కురియుచున్నను, ఎండ కాయుచున్నను ఆఫీసుకు వచ్చి మీ ఆదేశముల ప్రకారము పొదుపు ఉద్యమ ప్రచారమును నిర్విఘ్నముగా కొనసాగించుచు, పావలా ఆదాయము కలవారిచేత 24 నయాపైసలు పన్ను కట్టించి కనీసము మూడు నయాపైసలు పొదుపు సర్టిఫికెట్లు కొనిపించి, రాష్ట్రములో త్రాగుమోతులు కట్టు పన్ను చాలనందున త్రాగనివారివద్ద అధికముగా పన్నులు వసూలు చేయుటలో తమ శక్తి సామర్థ్యములు ప్రదర్శించు ఉద్యోగుల అదృష్టమును గూర్చికూడా మేము వ్యాస, కథా, నవలా, నాటకాదులు ప్రచురించుటలేదు.

ప్రపంచములో త్రాగుబోతు గిరిపన్ను కట్టుట సహజము. కాని త్రాగుడు మానిపించు శాసనము వచ్చినందున కలిగిన నష్టమును భర్తీ చేయుటకు త్రాగనివారిచేత పన్ను కట్టించు మీ ఔదార్యము ఇంత కాలమునకు వార్తా సంస్థల కెగబాకినది. వారినుండి మేము వార్తలు క్రమము గొనుచున్న మాట యదార్థమే. క్రమమైనంత నే దానిపై హక్కులన్నియు మావి కద. పైగా వచ్చు లావాదేవీలకు వారు బాధ్యులు కాని, ప్రచురణ విషయమున సర్వాధికారములు మావియే యని వారికిని గూడ తెలియును.

తెలిసియుండియు వారు సదరు వార్తా సంస్థలవారు 'లాకలూకాయి' వార్త విషయమున తీసికొన్న నిర్ణయము బహు చిత్రముగా నున్నది. ఆ వార్తను గూర్చి ఇంతవరకూ ఐక్యరాజ్య సమితి ఏ ప్రకటనము చేయలేదు. అహిరావణ, మహిరావణులవంటి అమెరికా - రష్యా ప్రముఖ ప్రజాస్వామ్య నాయకులకున్నూ సీలు ఒక్కడి వేయవలెనా? ఉక్కడి వేయవలెనా అను అంశమున వచ్చిన అభిప్రాయభేదమే విడలేదు.

ఏతాదృశస్థితిలో వార్తా సంస్థాధిపతులు చేసిన ఊహాశాసనపు వార్త లాకలూకాయి గారికే అవమానకరముగా నున్నది.

ఉన్నందుననే మేము ఆ వార్తను దేశ, జాతి ప్రతిష్ట దృష్ట్యా ప్రచురింపక నిలబెట్టినాము.

త్రాగుబోతుల పన్ను త్రాగనివాడు కట్టుటలోకూడ కొంత న్యాయమున్నది. ఏల యనగా- అందు కొంత సహకారభావము, కొంత దయా ఉన్నది. త్రాగు డనునది ఒక దౌర్బల్యము, దుర్బలులకు సాయము చేయుట ప్రభుత్వ విధి. ప్రభుత్వము ప్రజలది. కావున ప్రజలు కొందరు త్రాగుడు దుర్బలతకు వశులయినప్పుడు తక్కుంగలవారు త్రాగకపోయినను ఎదుటివారి దౌర్బల్యమునకు సహకారముగా పన్ను కట్టుట మా యెరిగినంతలో ప్రజాస్వామ్య విరుద్ధము కాదు. కానందుననే మే మీ విషయమున ప్రభుత్వమును విమర్శింప కలనైన తలపోయలేదు ప్రధానివర్యా—

అట్టి స్థితిలో మాకు అవసరము లేని వార్తలకుకూడా మేము సొమ్ము చెల్లించుచున్నను తృప్తిం బొందక మేము ప్రచురించుకో నిచ్చగించని వార్తలకు అధిక సుంకము వేయుట మాకు శిక్ష ననుగ్రహించుటయే అని విశ్వసించుచున్నాము.

ఉదాహరణకు ప్రజల కవసరములేని కొన్ని కరపత్రములకు, ఒక్కడుకూడ చదవని సమాచారశాఖ ప్రచురణలకు, దేవాదాయ శాఖ ఆరాధనలకు పొదుపు సహకారము ఆదిగాగల ప్రభుత్వాధికారుల దాకా పత్రికలకు అనవసరముగా అధిక వ్యయము వ్యర్థ మగుచున్నదని అల్లాలుపెట్టు ఘోషను మేము పత్రికలలో ప్రచురించుటయే లేదు. అందుకు ముఖ్యకారణము ప్రజాస్వామ్యములోకూడ రాజ స్వామ్యములోవలె కొంత ధన దుర్వినియోగ మవసరమని మేము భావించుటయే కద.

దుర్వినియోగము జరపనిచో ఆడిట్ శాఖ నెత్తిమీద చేయిపెట్టి దాని నెత్తి వేయవలయును, రహస్యాపరాధ పరిశోధనశాఖకు తాళము వేయవలయును. శాసనసభలో, లోక్ సభలలో మంత్రుల ప్రశ్నల సమయము తగ్గిపోవును. దొంగలూ, దోషులూ లేనియెడల పోలీసు శాఖకూ, న్యాయస్థానమునకూ పనిలేనట్లు, హోటళ్లు మూసివేసినచో డాక్టర్లను సృష్టించు మెడికల్ కాలేజీ యంత్రం మూలబెట్టవలసినట్లు దుర్వినియోగమే ప్రభుత్వము చేయనిచో నిరుద్యోగుల సంఖ్య విపరీతముగా పెరుగునను పరమ సత్యము పాత్రికేయులకు తెలిసినట్లు ప్రజల కట్లు తెలియును.

తెలియనందుననే వారు ప్రతి పక్షముల చెప్పుడు మాటలలో పడి తలలు పాడుచేసుకొనుచున్నారు. తలలు పాడయినందున తలపులు పాడగుచున్నవి. తల బోడిచేసుకొన్న వేమన వేదాంతి లేమియు తెలియక తలలు బోడులైన తలపులు బోడులా అన్నాడు. అది విషయాంతరము.

విషయ మేమనగా?—

లాకలూకాయి అను నాతనిని గూర్చి ఐక్య రాజ్య సమితి సమగ్ర నివేదికను సమర్పించు వరకు వార్తాసంస్థలు ఊహా గానములు చేయరాదనియూ, చేసినను పత్రికలకు సరఫరా చేయబడకూడదనియూ, బడిననూ అవి ప్రచురించమనియు, రించనందుకు అధిక సుంకము విధించరాదనియూ ఒక ప్రత్యేక శాసనము త్వరగా అమలుచేయ ప్రార్థన...